# 3.

# మూఢమతి - ముక్తమతి

**జిహ్వే రసజ్ఞే మధుర ప్రియేత్వం**
**సత్యం హితం త్వాం పరమం వదామి**
**ఆవర్ణయేథా మధురాక్షరాణి**
**గోవింద దామోదర మాధవేతి**

విద్యార్థులారా!

భారతదేశము ఈనాడు భారతదేశము అనిపించుకునే రీతిగా వున్నదా లేదా అనేటువంటి సందేహము ప్రతియొక్క భారతీయునకు కలగక తప్పదు. ఈనాడు భారతీయ సంస్కృతి అంతయు కూడను కేవలము హాస్యాస్పద మైన స్థితియందు మనము అనుభవించుతున్నాము. గాయత్రీ మంత్రము యొక్క తత్వము ముక్కు పట్టుకోవటములో ముగిసిపోతున్నది. సన్యాసుల యొక్క తత్త్వము సంసారులకంటె అతి బాధ్యతలు వహించే పరిస్థితి పూనుకుంది. ఇంక ప్రాణాయామతత్త్వము పటాపంచలముగా కనిపిస్తున్నాది. యిలాంటి పరిస్థితి యందు ఇది భారతదేశమా కాదా అనే సందేహము రాక తప్పదు. ప్రతి దేశమునందు కొంతకాలమునకు యిట్టి పరిస్థితుల పరిణామము పొందటం సహజం. దేశకాల పాత్రల ననుసరించి దేశమునందు అనేక మార్పులు కలగటం సహజం. అట్టి మార్పుల సమయమునందు ఈ సత్యనిత్యమైన తత్త్వాన్ని ప్రబోధించే నిమిత్తమై పరమహంసలుగాని, అవతారపురుషులు గాని, జగత్తునందు నరాకారమును ధరించి ధర్మప్రచారప్రబోధలు సల్పటంకూడను పరమసత్యము.

జగత్తునందు వేదవిహితమైన ధర్మమునకు గ్లాని సంభవించిన సమయమునందు ఆదిశంకరులు అవతరించి, వేదవిహితమైన అద్వైత సిద్ధాంతమును ప్రబోధించి, భారతదేశమునకు ప్రధానపీఠమును స్థాపించి, ఈ ధర్మమును పునరుద్ధరింపజేసినారు. అనగా కృష్ణుడు ఈ జగత్తును వదలి తాను నిరాకార రూపము ధరించినటువంటి సమయమునందే ధర్మము కేవలము అధర్మస్వరూపాన్ని ధరించింది. నందననామ సంవత్సరము, వైశాఖ కృష్ణ పంచమి, ఆదివారము బ్రహ్మముహూర్త సమయమందు కాలడి

sri sathyasai vahanamrutam

అనే కేరళ గ్రామమునందు ఆదిశంకరులవారు క్రీ॥శ॥788 సం॥లో శరీరమును ధరించాడు. అట్టి పవిత్రమైన జన్మమును తాను ఎత్తి 5 సం॥ల వయస్సునందే గాయత్రీ మంత్రమును పఠించి, తద్వారా 13, 14 సం॥ల యందే నాలుగు వేదములను క్షుణ్ణముగా తెలుసుకొని తద్వారా జగత్తును ఆధ్యాత్మిక మార్గమందు ప్రవేశింపజేయటానికి కంకణము కట్టుకున్నాడు. సర్వోపనిషత్తులను తాను అనేకరకములైన సూక్ష్మమార్గమునందు ప్రపంచమునకు అందించటమే కాకుండా తాను ఒక భాష్యమును కూడా వ్రాసి శంకరభాష్యము అనే సార్థకనామముతో లోకానికి అందించిన మహావ్యక్తి. తన కాలమును, కాయమును ఈవిధమైన పవిత్రమైన భారతీయ సంస్కృతిని ప్రచార ప్రబోధలు సలిపే నిమిత్తమై యావత్ భారతదేశము సంచరించి తాను కొంత కాలము కాశీ పట్టణములో నివసించటానికి సంకల్పించుకున్నాడు.

## గోవిందం భజ మూఢమతే

శంకరుల వారితో 14 మంది ప్రధానమైన శిష్యులు వెంట వచ్చారు. కాశీ పట్టణమునందు వీధి వీధియందు వేదఘోషలు చాటించుచూ మానవ జన్మ విశిష్టతను ప్రబోధిస్తూ రావటము అతని దినకృత్యముగా తీసుకున్నాడు. ఆవిధమైన సంచారము సలుపుతున్న సమయములో ఒక బజారునందు వృద్ధుడైన బ్రాహ్మణుడు ఒక పాత గృహము లోపల తాను వ్యాకరణము యొక్క ధాతువును గురించి పఠిస్తున్నాడు. అట్టి సమయములో శంకరులవారు ఆ గృహములో ప్రవేశించి ఆ బ్రాహ్మణునితో సంభాషణ సలిపాడు. 'స్వామీ! ఈ వ్యాకరణము పఠించటములో వచ్చిన ఫలితము దయచేసి తెలుపమని అడిగాడు. 'స్వామీ! నా సంసారము అతి పెద్దది. దీనిని పోషించుకునే శక్తి సామర్థ్యములు నాకు లేవు. ఏదో ఒక విధముగా చదివి పండితుడననిపించుకొని నాలుగు ముక్కలు వారితో చెప్పి నాలుగు కాసులు ఆర్జించి సంసారమును పోషించుకునే నిమిత్తమై నేను శ్రమపడుతున్నాన'ని ఆ బ్రాహ్మణుడు శంకరులవారికి ప్రత్యుత్తరమిచ్చాడు. అప్పుడు అతనికి చెప్పవలసిన విషయములన్నియు చెప్పి తాను తిరిగి తనయొక్క నివాసమునకు వచ్చి ఆనాడు జరిగిన దానిని ఒక పల్లవిగా ఒక శ్లోకమును తాను వ్రాయటానికి పూనుకున్నాడు. ఆ వ్రాసిన శ్లోకమును 14మంది శిష్యులను కూర్చుండబెట్టుకుని తాను

**భజగోవిందం భజగోవిందం గోవిందం భజ మూఢమతే**
**సంప్రాప్తే సన్నిహితేకాలే నహి నహి రక్షతి డుకృఞ్కరణే**

srisathyasaivahini.org

**హరిగోవిందా హరిగోవిందా**
**హరి గోవిందా అనరా మందా**
**మృత్యువు దాపున మసలేటప్పుడు**
**వ్యాకరణము నిను కాపాడదురా**

అని ఈవిధమైన రీతిగా తాను ఉచ్చరించాడు. ఈవిధమైన శ్లోకము జగద్గురువులు బోధించిన తక్షణమే శిష్యులు మాత్రము సామాన్యమైన వారు కాదు. గురువుకు తగిన శిష్యులగుటచేత 14మంది కూడను 14 శ్లోకములు చెప్పి గురువును అప్పటికప్పుడు సంతృప్తి పరచటానికి పూనుకున్నారు. ఈ 14 మంది 14 శ్లోకములు చెప్పి గురువును సంతోషపెట్టిన తక్షణమే తాను ద్వాదశమంజరి అనే రీతిగా తిరిగి 12 శ్లోకములు జగత్కళ్యాణ నిమిత్తమై వ్రాసారు. తదుపరి తాను యోచించుకుంటూ కూర్చున్నాడు. కేవలము ప్రబోధలు చేసినంత మాత్రమున ప్రయోజనము యేమాత్రము వుండదని తాను భావించి ఆశీర్వాదముగా తిరిగి తాను నాలుగు శ్లోకములు ఉచ్చరించాడు. దీనిని **మోహముద్గర** అనేటువంటి రీతి క్రింద, మొదటిది భజగోవిందమనే పల్లవి, తదుపరి 12 శ్లోకములు, శిస్యుల యొక్క 14 శ్లోకములు, ఆశీర్వాదశ్లోకములు నాలుగు అన్నియు చేరటం చేత 31 శ్లోకములుగా తయారై యిది మోహముద్గర అనే రీతిగా ప్రపంచమునకు అందిస్తూ వచ్చారు. ఇందులో ప్రధానమైనది మూఢమతే అనేటువంటి దాని క్రింద తాను ప్రధాన లక్ష్యాన్ని నిరూపించాడు. ఎవరు ఇందులో మూఢమతి? ఎట్టివారిని మనము మూఢమతి అని పిలువడానికి వీలవుతుంది? అనే దానిని చక్కగా విచారణ చేసుకొని తాను సరైన జవాబును అందించాడు. “నాస్తికో మూఢ ఉచ్యతే” అనే దానిలో మనము విచారణ చేసినప్పుడు, అనాత్మవాదియే మూఢమతి అని తాను నిర్ణయము చేశాడు. నాస్తికో మూఢ ఉచ్యతే అనే పదములు ధర్మరాజు యక్ష ప్రశ్నలయందు ఉపయోగపెట్టాడు. అయితే, మూఢులు అనగా మన పరిభాష లోపల కేవలము అనాత్మవాదిగా భావిస్తున్నాము. కాని, మనము ఈనాడు భావించవలసిన మూఢమతుల యొక్క సత్యమైన అర్థాన్ని కొంత విచారణ సల్పాలి. నేను దేహమును కాదు, అమృతస్య పుత్రుడను. దేహము క్షీణించునది, నేను నశించువాడను కాను అనే సత్యాన్ని తెలుసుకోవటం చాలా తక్కువమంది. భౌతికమైన దృష్టియందు చూచినప్పుడు నాకు నేను దేహముగా పుట్టాను, నాకు నేను

sri sathyasai vachanamrutam

పెరుగుతున్నాను, నాకు యిష్టమైన భోగములను అనుభవించుకునేటువంటి ఆనందము నాకున్నది అనే వాంఛలో తన జీవితమును వ్యర్థము చేసుకోవటం ఒక భాగము. నా యిష్టాయిష్టములకు నేనే అధికారిని గాని అలాంటి విషయములో దైవతత్త్వము ఏ మాత్రము ప్రవేశించనక్కరలేదని, నాయొక్క యిష్టములలో దైవమును నేను సేవించవలసిన బాధ్యత యేమాత్రము లేదని, దైవమును నేను విశ్వసించవలసిన అవసరము లేదని భావించే తత్త్వము మరొకటి. అయితే దీనికి పరమ విరుద్ధమైన మరొక మార్గము లేకపోలేదు. నా గృహమునకు నేను గుత్తను కడుతున్నాను, నా వృత్తి పన్ను నేను చెల్లిస్తున్నాను. నీటికి విద్యుత్‌శక్తికి పన్ను చెల్లిస్తున్నాను. నిత్యజీవితములోపల అనుభవించటానికి తగిన అనుకూలములకంతా పన్ను చెల్లిస్తున్నాను అనే భావము ఒకనియందు వుంటుంది. భౌతికమైన జలమునకు, విద్యుత్‌శక్తికి, భౌతిక నివాసమైన గృహమునకు, భౌతిక సంబంధమైన వృత్తులకు తాను పన్నులు చెల్లిస్తున్నాననే భావము తాను భావించినా, మరొకవైపున చక్కగా విచారణ చేసినప్పుడు నివసించటానికి ఏర్పరచిన ఈ భూమికి ఏమి పన్ను చెల్లిస్తున్నాను, నేను జీవించటానికి తగిన ప్రాణమునకు ఏమి పన్ను చెల్లిస్తున్నాను, నాకు వెలుతురు నందించే సూర్యచంద్రాదులకు ఏమి పన్ను చెల్లిస్తున్నాను, నాకు అన్ని విధములైన శబ్దములు ప్రసాదించిన ఆకాశ స్వరూపునకు ఏమి పన్నులు చెల్లిస్తున్నాను, యిట్టి అగమ్య గోచరమైన ఆధారమే లేకున్న ఈ క్షణమైన భోగములకు ప్రధానమైన లక్ష్యాన్ని అందించటములోనున్న వివేకము ఏమిటని వారు విచారించుకొనక తప్పదు.

## దైవాన్ని ఆధారం చేసుకుని దేహాన్ని అనుభవించాలి

ఎలాంటి సైంటిస్టులైనా కూడను వున్నటువంటి పదార్థమును విభాగము చేసి చూపించగలరు, చేయించగలరేగాని లేని దానిని మాత్రం సృష్టించటానికి వీలుకాదు. ఈనాడు మానవునికి కావలసిన జలమును, ఆక్సిజను, హైడ్రోజను కలిపి జలమును తయారు చేయగలుగుతున్నారా? సహజమైన వర్షములు కురిపించగలుగుతున్నారా? మానవునికి సంబంధించిన ప్రాణవాయువును సృష్టించి అందించటానికి పూనుకుంటున్నారా? ఇంతేకాదు. ప్రపంచమునకు ప్రకాశమునందించే సూర్యచంద్రాదులను వారు సృష్టించగలుగుతున్నారా? ఏవో కొన్ని పదార్థములను చేర్చుకొని, కృత్రిమంగా వారు తయారు చేయటం అంతో యింతో జరపవచ్చుగాని,

sri sathyasaivachanamrutam

యావత్ ప్రపంచమునకు జలమును అందించి, సూర్య చంద్రాదుల ప్రకాశమును మార్పు చేయించి, ప్రాణవాయువును సృష్టింప గలిగేది ఎవ్వరితరము కాదు. ఇది అంతయు ఒక భగవత్సంకల్పముతో యిమిడి వున్నదే గాని, భౌతికమైన స్వరూపము చేయటానికి ఏమాత్రము సాధ్యము కాదనేటువంటి సత్యాన్ని ఎవరు తెలుసుకున్నారో వాడే మూఢమతి కాదు. అనేక పెద్ద పెద్ద పట్టణములందు త్రాగుటకు కూడను నీరు లేకపోవటంచేత అనేక విధములైన సైంటిస్టులు చేరి సముద్ర జలమును త్రాగునీరుగా మార్చాలని ప్రయత్నము చేస్తున్నారు. అందులో కొంతవరకు వారికి ఫలితము చిక్కవచ్చును. ఈ సముద్రము నీరే లేకపోతే దీనిని తీయనీరుగా మార్చటం వారిచేతనౌతుందా? కనుక original లేకుండా కల్పితమైనది సృష్టించటానికి సైంటిస్టుల తరము కాదు. ఎట్టి అధిక స్థానమునందుకున్న సైంటిస్టు అయినాకూడను పంచభూతముల కతీతమయిన వాటితో అతనికి ఏమాత్రము సంబంధము ఉండదు. ఈ పంచభూతముల వెనక తెరపైన వుంటున్నాడు పరమాత్ముడు. పంచభూతములు దాటిన తరువాతనే పరమాత్మ తత్త్వాన్ని వ్యక్తీకరింపచేసుకుంటాడు. పంచభూతముల సంబంధము వుండినంత వరకు పరమాత్మ తత్త్వము అర్థము కాదు. ఈ పంచభూతములు ఈ ప్రకృతికి మాత్రమే మన జీవితాన్ని కొంతవరకు అనుకూల పరచుకొని ఆనందమును అనుభవించి దివ్యత్వమైన దైవత్వమును అనుభవింపజేయటానికి ఒక ప్రధానమైన రంగంగా వుంటుంది. అంతేగాని ఈ పంచభూతములలోపలనే పరమాత్మ తత్త్వాన్ని అర్థము చేసుకోటానికి పూనుకోవటం కాలము వ్యర్థము చేయటమే అవుతుంది. ఈ పంచభూతములు పరమాత్మ సంకల్ప స్వరూపములనేటువంటి సత్యాన్ని గుర్తించినవాడు పరమపవిత్రుడు. కనుక మూఢమతి అనగా దివ్యత్వమైన దైవానుగ్రహమునకు పాటుపడక, ఈ పంచ భూతములతో నేటికో రేపటికో పోయే జీవిత నిమిత్తమై మనము అనేక శ్రమలను పడి కొన్ని నిరాశలకు గురియై జీవితమునకు వృధా పరచుకొనే ప్రయత్నములు చేసుకున్నంత వరకు మనము మూఢమతులమేనని విశ్వసించక తప్పదు. దైవాన్ని ఆధారము చేసుకొని దేహాన్ని అనుభవించటానికి పూనుకోవటం మనం ప్రయత్నం సల్పాలి.

**పశుత్వాన్ని కూడా పరిపాలన సలిపేవాడే గోవిందుడు**

ఇంక రెండవ పదమునందు, "సంప్రాప్తే సన్నిహితే కాలే" అన్నాడు. మానవునికి అన్ని భయములకంటే మృత్యుభయము చాలా భయంకరమైనది. ఆ మృత్యువు కూడను లక్ష తేళ్లు మన దేహముపైన ప్రాకినట్లు, కాదు కాదు, లక్షతేళ్లు కుట్టినట్లు బాధగా ఉంటుంది. మృత్యు



sri sathyasai vachanamrutam

సమయమందు కనుక, యిట్టి భయంకరమైన బాధను నీవు అనుభవించే సమయమునందు నీకు భగవంతుడు తప్ప అన్యులు సహాయకారులు కాదు అనే సత్యము కూడను "నహి నహి రక్షతి డుకృఙ్కరణే" అన్నాడు. ఇంక 'గోవిందం గోవిందం భజగోవిందం గోవిందం'. గోవిందము అనేదానికి అనేక రకములైన అర్థములు అనేకమంది పెద్దలు ప్రబోధిస్తూ వచ్చారు. అసలైన అర్థం గోవులను పాలించేవాడని, గోవులను భరించేవాడని యిందుకు అర్థము. అనగా పశుత్వాన్ని కూడా పరిపాలన సలిపేవాడే గోవిందుడు. మానవుని యందు శేషముగా పశుత్వము ఉండటం చేత యీ పశుత్వము యొక్క లక్షణాన్ని పరివర్తన గావించి, పరిశుద్ధమైన స్థితియందు పరమాత్మునికి అర్పితము చేయించే నిమిత్తమై గోవిందుడు యీ రూపమును, నామమును అనుభవిస్తున్నాడు. పశుత్వానికి మానవత్వము అలభ్యము. మానవత్వానికి దివ్యత్వము లభ్యము. అయితే మానవత్వములో పశుత్వము కొంచెం శేషముగా ఉంటున్నది. ఈ పశువు యొక్క లక్షణాన్ని మనము ఒకతూరి విచారించాలి. పచ్చనిగడ్డి చూపినప్పుడు దగ్గరగా వచ్చి ఆనందముగా తోకనల్లాడిస్తుంది. అదే గోవుని తుంటకఱ్ఱను తీసుకొని గట్టిగా మోదినప్పుడు దూరంగా పరుగెత్తుతుంది. ఈనాడు కూడను మానవునికి పదికాసులు చూపితే చక్కగా దగ్గరకి వస్తున్నాడు. గట్టిగా కసరితే దూరము వెళ్లిపోతున్నాడు. ఇది పశుత్వము యొక్క లక్షణము కాక మానవత్వము యొక్క లక్షణాలా! కనుక మనము భయపడకూడదు, భయపెట్టకూడదు. భయపడుటకు మనము పశువులు కాదు. భయపెట్టుటకు మనము మృగములు కాదు. అయితే కొన్ని తప్పొప్పులు జరిగిన సమయమందు దానికి కొన్ని రకములైన సత్యము ప్రబోధించి, దానికి తగిన శిక్షణ యివ్వటానికి మానవత్వము లోపల వివేకము గాని అవివేకమునకు యేమాత్రము సంబంధము కాదు. కనుక గోవిందా అనేది కేవలము మానవుల యొక్క తప్పొప్పులను తీర్చిదిద్ది తప్పుకు తగిన శిక్ష, ఒప్పుకు తగిన ఫలితమును అందించి పరమాత్మ సన్నిధి పెన్నిధిగా అనుభవింపచేసే ఈ గోవిందుని యొక్క లక్షణము. కనుక, మనము నిరంతరము గోవిందుని స్మరించక తప్పదు. భజించక తప్పదు. విశ్వసించక తప్పదు. ఈ గోవింద అనే దానికి మరొక అర్థము కూడా ఉన్నది. శబ్దము అని దీనికి ఒక అర్థము. మానవుడు పలుకు పలుకులకు, పశువు అరచు అరుపులకు వేదములో చెప్పు మంత్రములకు ఒక్క శబ్దమే

srisathyasaivachanamrutam

ప్రధానము. ఈ శబ్దములలో కొన్ని భేదములు ఉండవచ్చునేగాని శబ్దము మాత్రము ఏకశబ్దమే. కనుక శబ్ద స్వరూపుడైన వాడు గోవిందుడు అని మరొక అర్థము. "గాం భూమిం గేహం స్వర్గం వేదంవా విందతీతి గోవిందః" అన్నాడు. భూమి అనగా ఈ జగన్నాటకమైన యీ వేదికకు తాను సూత్రధారుడుగా ఉన్నాడనే సత్యాన్ని యీ భూమిం అనే శబ్దములో అర్థాన్ని బోధిస్తుంది. సర్వసుఖములకు నిలయమైన స్వర్గ స్థానమునకు తాను ఒక అధికారి అనేటువంటి అర్థాన్ని స్వర్గః అనేది నిరూపణ చేస్తుంది వేదము. "వేదో నారాయణో హరిః" నారాయణుని యొక్క తత్త్వము వేదము మనకు నిరూపణ చేస్తూ వచ్చింది. కనుక, యీ స్థూలమైన, సూక్ష్మమైన, కారణమైన జగత్తునందు గోవిందుని యొక్క తత్త్వము చక్కగా విశిష్టమైన దివ్యత్వములో ప్రకాశిస్తుందనే అర్థాన్ని గోవింద అనే పదము మనకు బోధిస్తూ వచ్చింది. దీనిని పురస్కరించుకొనియే ప్రహ్లాదుడు కూడను

**'దీన శుభము లేదు, దివ్య జీవములేదు,**
**జగతి పుట్టి పుట్టి చచ్చి చచ్చి**
**పుట్టనేల మనము, పుట్టియు చచ్చియు**
**చావులేని పుట్టు పుట్టవలయు'**

అని తాను బోధించాడు. ఇట్టి సత్యమైన త్రోవ వెతుకువాడే దొడ్డబుద్ధి అన్నాడు. కనుక, ప్రహ్లాదుడు ఉచ్చరించిన పదములు మనము చక్కగా విచారణ చేసినప్పుడు దొడ్డబుద్ధి అని చెప్పాడు గాని గొడ్డుబుద్ధి అని చెప్పలేదు. అనగా అమృతస్థానమైన దివ్యత్వాన్ని ఆశించినవాడిది దొడ్డబుద్ధియని, దానిని విస్మరించిన వాడిదే గొడ్డుబుద్ధి అని ప్రహ్లాదుడు నిర్ణయపరిచాడు. దీనిని ఏరీతిగా పొందటము అనే సందేహము కల్గినవారికి సరైన జవాబును అందించాడు. దేహమే విల్లు, మన మనస్సే దానియొక్క త్రాడు. మనయొక్క ప్రాణమే దీని యొక్క అంబు. అనగా ఈ దేహమనే విల్లు మనస్సు అనే దారముతో స్వాధీనపడిపోయింది. ఈ మైండు అనే దారములోపల ప్రాణము అనే అంబును పెట్టి మనము లాగినప్పుడు ఆ విల్లు కూడను వంగుతుంటుంది. మనస్సును ఎంత లాగి విడుస్తామో ప్రాణము అంతసూటిగా వెడుతుంది. కనుక, దేహమునకు కట్టిన యీ మనస్సనే దారమును గట్టిగా పట్టి లాగాలి గాని దానిని విచ్చలవిడిగా విడిచిపెట్టకూడదు. దీనిని పురస్కరించుకొనే మనస్సును అరికట్టటమే మానవునకు ప్రధానమైన మార్గము

sri sathyasaivahanamrutam

అన్నారు. కానీ యీనీటి బుడగ వంటి దేహముతో ఈ చంచలమైన మనస్సుతో ప్రాణమును విచ్చలవిడిగా సంచరింపచేయటము వలన మన జీవితమంతా గొడ్డు జీవితముగా తయారైపోతున్నాది. ఈ ప్రథమ శ్లోకము అన్నమయ, మనోమయ, ప్రాణమయముల యొక్క తత్త్వమును ప్రకటిస్తు వచ్చింది. ఈ అన్నము లేక దేహము జీవించుటకు వీలు కాదు. దేహము లేక మనస్సును మనము వెతకటానికి వీలుకాదు. మనస్సే లేకపోయిన ప్రాణమును గుర్తించటానికి సాధ్యము కాదు. కనుక విజ్ఞానమయ ఆనందమయములు రెండు కూడను ఈ అన్నమయ, మనోమయ, ప్రాణమయములపై ఆధారపడి ఉండటంచేత ఆ విజ్ఞాన మయ ఆనందమయములకోసం మనము ప్రాకులాడుతున్నాము. అన్నమయ, మనోమయ, ప్రాణమయములు అనిత్యములైననూ, విలువలేనివి అయినప్పటికిని ఈ విజ్ఞానమయ ఆనందమయములు అతి ప్రధానమైన పరతత్త్వములైనప్పటికిని యీ విలువలేని అన్నమయ మనోమయ ప్రాణమయములపైనే ఆధారపడి వుంటున్నాయి. విజ్ఞానమయ ఆనందమయములను అనుభవించే నిమిత్తమై యీ అన్నమయ, మనోమయ, ప్రాణమయములను మనము కాపాడుకోవాలి. దీనికి ఒక చిన్న ఉదాహరణము. మన యింటియందు విలువైన నగలు, వజ్రములు ఉండినప్పుడు దానిని విలువలేని ఇనుప పెట్టెయందు విలువైన వస్తువును దాచుతున్నాము. ఈ విలువలేని పెట్టెలో విలువైన వస్తువులు దాచుకోటం వెఱ్ఱితనంగా మనము యీనాడు భావిస్తున్నాము. మన దేహమే వ్యర్థమైన విలువలేని పెట్టె. ఇట్టి విలువలేని పెట్టెయందు విలువైన విజ్ఞానమయ, ఆనందమయమైన వజ్రములు దాచినాడు భగవంతుడు. మన అవసరమును పురస్కరించుకొని యింత విలువైనవి విలువలేని దేహములో భగవంతుడు పెట్టటం సమంజసము కాదని కొంత హాస్యాస్పదముగా భావించుకుంటాం. భగవంతుడు బుద్ధిస్వరూపుడు కనుకనే తనకు అనేకరకములైన విచారణాశక్తి తనయొక్క సంకల్పములో లయమైపోవటముచేతనే అన్నియు కూడను ఫలవంతమైనవే తాను సృష్టిస్తాడు గాని, ఫలవంతముగానివి సృష్టించటానికి యేమాత్రము సంకల్పించడు. విలువైన బంగారునగలు విలువైన బంగారు పెట్టెలోనే మనము దాచటానికి ప్రయత్నిస్తే లోపలవున్న నగలు ఎవరూ చూడరు పెట్టె మాత్రమే చాలని దొంగిలించటానికి పూనుకుంటారు. కనుక, విలువైన

వస్తువులు విలువలేని పదార్థములయందు దాచుకోవటము సహజమైనది. సరియైన రీతి. కాన, మన విలువైన విజ్ఞానమయ, ఆనందమయములను వినియోగించుకొను నిమిత్తము, వాటిని అందుకునే నిమిత్తము విలువలేని అన్నమయ, మనోమయ, ప్రాణమయములను సక్రమమైన మార్గములో కాపాడుకోవటం ప్రధానమైన కర్తవ్యము. ఇందులో మనము మరొక చిన్న విషయము ఆలోచించాలి. పెట్టెలో విలువైన నగలు దాచాము కానీ దానికి ఒక బీగము వెయ్యాలి. బీగము వేశాము. బీగాన్ని భద్రము చేసుకోవాలి. బీగాన్ని భద్రము చేసుకోకపోతే యిందులోని విలువైన వస్తువులు కూడను మనకు అవసరమైన సమయంలో అందుకొనుటకు సాధ్యము కాదు. దీనినే భక్తి అనే రీతిగా ఉచ్చరిస్తూ వచ్చాడు శంకరులవారు. దీనిని వైరాగ్యము అనేవైపుకు తిప్పినప్పుడు యీ పెట్టె తెరచుకొని దానిలోని విజ్ఞానమయ ఆనందమయములు మనకి లభించుటకు అవకాశముంటుంది. ఈ భక్తి అనే బీగము రాగము అనే వైపు త్రిప్పితే తలుపులు తెరచుకొనవు, అందులోనున్న విలువైన వస్తువులు మనకు లభించవు. కనుక, రాగ విరాగములకు మధ్యదైన భక్తి అనే బీగమును మనము భద్రము చేసుకోవాలి. ఈ భక్తి భగవద్విశ్వాసము ఉండినప్పుడే మనకు లభిస్తుంది గాని భగవద్విశ్వాసము లేనప్పుడు భక్తి మనకు లభించదు. ఈనాడు ప్రపంచమందు భగవద్విశ్వాసము లేని వ్యక్తులే అధికముగా కనిపిస్తున్నారు కాని, భగవద్విశ్వాసము లేకుండా బ్రతకటానికి ఒక్క క్షణమైనా వీలుండదు. దేవుడనగా కేవలము ప్రత్యేకించిన స్వరూపాన్ని ధరించి లోకములో అవతరించటమనిగాని లేక ఒక ప్రత్యేకమైన శక్తితో ఒక ప్రదేశములో ప్రకాశిస్తున్నాడనిగాని మనము భావించకూడదు. మన హృదయస్థానమునందున్న పరిశుద్ధ భావస్వరూపుడే భగవంతుడు. అట్టి పవిత్రమైన భావములేని హృదయము ఏ మానవునికి ఉండకుండాపోదు. కనుక అట్టి పవిత్రత ప్రతి హృదయమందు ఉన్నది కనుక తనను తాను విశ్వసించనప్పుడే భగవద్విశ్వాసమని చెప్పటానికి వీలవుతుంది. తనను తాను విశ్వసించనివాడే భగవద్విశ్వాసానికి పూనుకోడు. ప్రతి మానవుడు తనను తాను ప్రేమించు కుంటున్నాడు, తనను తాను విశ్వసిస్తున్నాడు. తనకు తాను ఉత్తమమైన స్థానము నకు చెందాలని ఆశిస్తున్నాడు. దైవాన్ని విశ్వసించని మానవుడు కూడను తనను తాను ప్రేమించుకునే దివ్యశక్తి తనకు తాను

srisathyasaivachanamrutam

అనుభవిస్తుంటాడు. ఇది సహజమైన భావములతోనే మన హృదయమునుండి ఉప్పొంగుతుంటుంది. దానికి ఒక చిన్న ఉదాహరణము.

**ఆత్మ విశ్వాసం చాలా ముఖ్యం**

ఒక గురువు ఒక ప్రదేశమునందు తాను నివసిస్తూ ఆ ప్రదేశములో చేరిన ప్రజలకంతా చక్కని జ్ఞానోపదేశము చేస్తున్నాడు. అతని దర్శనార్థమై వచ్చే ప్రజలు పత్రమో, పుష్పమో, ఫలమో తోయమో అన్నట్లుగా భారతీయ సంస్కృతిని పురస్కరించుకొని కొన్ని ఫలములను తెచ్చి గురువుకు అర్పిస్తున్నారు. ఆనాడు ఆ గురువు అధిక ఫలములు చేరటంచేత తనకు సమీపుడైన శిష్యుని దగ్గరకు పిలిచి యీ పండ్లు లోపలికి తీసుకొని వెళ్లి కోసి ఒక తట్టలో పెట్టి తీసుకువచ్చి అందరికి పంచమన్నాడు. ఆ పరమశిష్యుడు అన్నీ ముక్కలుగా చేసి గురువు చెంతకు తట్టలో పెట్టుకొని వచ్చాడు. 'స్వామీ! తమ ఆజ్ఞ. సిద్ధము చేశాను' అన్నాడు. 'సరే! నీవు పంచమన్నాడు' టీచరు. "ఎవరికి ముందు యివ్వాలి స్వామీ!" అన్నాడు యీ శిష్యుడు. 'నాయనా! నీకు ఎవరిమీద ఎక్కువ ప్రీతి ఉంటుందో వాని నుండి ప్రారంభించు'అన్నాడు గురువు. అందరూ అనుకున్నారు గురువుకు మొట్టమొదట యిచ్చి తదుపరి అందరికి యిస్తాడు అని, కానీ శిష్యుడు ఆ పనిచేయలేదు. తనకు తాను మూడు ముక్కలు తిన్నాడు. అందరూ చేరి, 'ఏమిటి? గురువుకు పెట్టకుండా నీవు తింటున్నావు' అన్నారు. ఆ శిష్యుడు జవాబు చెప్పాడు, 'ఎవరిపైన నీకు ఎక్కువ ప్రీతో వారికి మొట్టమొదట యివ్వమని గురువు ఆజ్ఞ. నాపై నాకు ఎక్కువ ప్రీతి యింక ఎవరిపై ఉంటుంది? కనుక self confidence చాలా ముఖ్యమని ఆ శిష్యులకు ప్రబోధించాడు. బాహ్య దృష్టితో మనము పరికించినప్పుడు గురువుకు యివ్వక పోయినందున భక్తి లేదని భావిస్తున్నాము కానీ తన ఆత్మతృప్తికోసమై తనకున్న భావమును సత్యస్వరూపములో ప్రకటించినటువంటిదే యిందులో భక్తికి సరియైన లక్షణమని ఆ కథ మనకు బోధిస్తూ వచ్చింది. కనుక భగవంతునికి నమస్కరించక భగవంతుని సేవించక, భగవంతుని భజించక, దేవాలయములకు వెళ్ళక తీర్థయాత్రలు సల్పక ఉండినంత మాత్రమున వారికి ఆత్మవిశ్వాసము లేదని మనము భావించకూడదు. ఆత్మవిశ్వాసము అనేది ఎవరికి వారికి ఆనందించ వలసినది కానీ ప్రదర్శించే విషయము కానేరదు. వ్యక్తిగతమైన భావములు

అనేకము వుండినప్పటికి ఆత్మతత్వమనే భావము అందరికీ ఒక్కటే అనే సత్యాన్ని శంకరులవారు ఈ భజగోవింద తత్వములో ప్రబోధిస్తూ వచ్చారు. ఈ మొట్టమొదటి పల్లవియందు, భగవద్విశ్వాసము అభివృద్ధి పరచే నిమిత్తమై యీ మూఢమతిని మాత్రమే అడ్డము పెట్టుకొని యింక తాను ముందుకు నడవటానికి తగిన మెట్లు వేస్తూ వచ్చాడు. మనము ఏదైనా పెద్ద భవనము ఎక్కాలనుకున్నప్పుడు దానికి ఒక నిచ్చెన మనము వేసుకుంటాము. అయితే ఆ నిచ్చెన క్రింద ఆధారము, పైన ఆధేయము రెండూ లేకుండా యీ నిచ్చెన మనము ఎక్కటానికి వీలుకాదు. కనుక యీ ఆధారమైనటువంటిది మూఢమతిగా తీసుకొని, ముక్తమతి అనేదానిని ఆధేయముగా తీసుకొని మధ్య లోపల జీవిత తత్వమనేటువంటి కఱ్ఱలు మెట్లుగా పెట్టుకుంటూ వెళ్లాడు. ముక్తమతికి, మూఢమతికి మధ్యలో 29 మెట్లుగా 29 శ్లోకములు పూర్తిచేశాడు. అయితే ఈ ఒక్క శ్లోకము యొక్క అర్థమును మాత్రమే తీసుకోటంచేత కొంత అనుమానాస్పదమునకు అవకాశము ఉంటుంది. ఇంక క్రమక్రమేణా రెండవ శ్లోకము, మూడవశ్లోకము చెప్పుకుంటూ పోయినప్పుడు యిది పూర్తిగా నిస్సంశయముగా, సుస్పష్టముగా మనకు అర్థమై మనసు మాలిన్యమును దూరము చేసి, పవిత్రమైన మానవ తత్వానికి నిలయమైన హృదయముగా తయారుచేస్తాయి భజగోవిందం యొక్క 31 శ్లోకములు కూడను.

**(తేదీ 22-05-1973 న బృందావనంలో భగవాన్ శ్రీ సత్యసాయిబాబావారి దివ్యోపన్యాసము)**

sri sathyasai vahini amrutam